

కారు- ద్విచక్రవాహనం ఢీ

కడప-చెన్నై ప్రధాన రహదారిలో మంగళవారం సాయంత్రం కారు- ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. - 8లో



మేరా భారత్ మహాన్.!


జిల్లాలో స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసుల కవాతు ఆకట్టుకున్నాయి. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.4 /25.6

జిల్లాలో మంగళవారం 25.6 - 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.



పోలీసు పెరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- రూ. 13,236 కోట్లతో ప్రాజెక్టుల పనులు
- 97,870 గృహ నిర్మాణాలు
- ఇండస్ట్రియల్ హబ్‌గా కొప్పర్తి
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



పెరేడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం కడప పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి కవాతును పరిశీలించారు. అనంతరం మంత్రి జిల్లా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. గండికోట ముంపు వాసుల పరిహారం కోసం రూ. 454 కోట్లకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. జిల్లాలోని 11 ప్రాజెక్టుల్లో 77.283 టీఎంసీలకుగాను ప్రస్తుతం 43.728 టీఎంసీలు నిల్వ ఉన్నాయన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన 13,236 కోట్ల రూపాయలతో జిల్లాలోని 11 ప్రాజెక్టుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ సాయం అందించడంలో జిల్లా రెండోస్థానంలో ఉందన్నారు. రైతులకు పంటల బీమా, తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది వ్యవసాయ రుణాలు రూ. 9565 కోట్ల లక్ష్యానికిగాను ఇప్పటివరకు రూ. 4823 కోట్లు రైతులకు ఇచ్చామన్నారు. ఈ ఏడాది 447 జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించి రూ. 938.62 కోట్ల వ్యయంతో 97,870 గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. నాడు-నేడు కింద రూ. 296.66 కోట్ల ఖర్చుతో 1005 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, అంగన్వాడీలలో పది రకాల మౌలిక వసతుల కల్పనకు పనులు వేగంగా కొనసాగిస్తున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి ప్రజల ఆదరణ లభిస్తోందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద 50,736 అర్జీలు రాగా, 49,494 పరిష్కరించామని తెలిపారు. జగనన్న సురక్ష కింద 2,85,000 సేవలను ప్రజలకు అందించామని వివరించారు. జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష కింద మొదటి దశలో 85 గ్రామాల రీసర్వే పూర్తయిందని, రెండోదశలో 72 గ్రామాల్లో సర్వే జరుగుతోందన్నారు. జిల్లాలో రూ. 26 వేల కోట్ల పెట్టుబడులతో 13 భారీ పరిశ్రమల స్థాపన ద్వారా 19,126 మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఇందులో సెంచురీ ప్యానల్స్ లిమిటెడ్, ఆదిత్య బిర్లా అండ్ ఫ్యాషన్స్ అండ్ రీటైల్ లిమిటెడ్, డీజీజీ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలు డిసెంబరులో ప్రారంభం కానున్నాయన్నారు. 31 పారిశ్రామికవాడల్లో పరిశ్రమల స్థాపనకు 9351 ఎకరాల భూమిని సేకరించామన్నారు. కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులో 540 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్లను రూ. 749 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చేందుకు రూ. 276 కోట్లతో చేపట్టిన నీటి సరఫరా, ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. కొప్పర్తిలో 2596 ఎకరాల్లో వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించామన్నారు. గోపవరం మండలం బద్వేలు ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమృత్ 2.0 నుంచి రూ. 15 కోట్ల తో పుట్లంపల్లె చెరువు సుందరీకరణ పనులు చేపట్టనున్నామన్నారు.

సమర యోధుల కుటుంబాలకు సన్మానం

స్వాతంత్ర్య సమరయోధులు శేషన్న కోడలు రమాదేవి, సుబ్బన్న సతీమణి నారాయణమ్మ, బాల యల్లారెడ్డి కోడలు అరుణాదేవి, టీకూరు సుబ్బారావు కుమారుడు సురేష్‌కుమార్, పక్కీరప్ప తరపున ఆలూరి శరత్‌బాబులను మంత్రి, కలెక్టర్ సత్కరించారు. మాజీ సైనికులు జి.జానకిరాం, జోసెఫ్ మనోహర్, రాగంశెట్టి నరసింహారావు, పి.లక్ష్మీనారాయణ, ఎల్లారెడ్డిలను సన్మానించారు. వ్యవసాయ, డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్, పశు సంవర్ధకశాఖ, గృహ నిర్మాణం, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ కార్పొరేషన్, పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, ఏపీఎస్ పీడీసీఎల్, నెడ్‌క్యాప్, అటవీశాఖ, రవాణాశాఖ, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలు, 104, 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, దిశ, ఏపీ వైద్య విధాన పరిషత్ శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన డాగ్ షో అందరినీ ఆకట్టుకుంది.

స్టాల్స్ ఏర్పాటు

వ్యవసాయం, డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా, ఐసీడీఎస్, సెరికల్చర్, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, ఆప్కో, పశు సంవర్ధకం, గృహ నిర్మాణం, మత్స్య, దివ్యాంగులు, వైద్య ఆరోగ్యశాఖలు, మున్సిపల్ కార్పొరేషన్, పోలీసుశాఖలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్, జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్లు రాహుల్‌మీనా, మౌర్య భరద్వాజ్, ఏఎస్పీ తుషార్‌డూడి తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న హౌసింగ్ శకటం



ఏఆర్ పోలీసుల విన్యాసం



నారాయణ పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన



అగ్నిమాపకశాఖ త్రివర్ణ విన్యాసం

వేమన వెలుగుతోంది..!

వైవీయూ పరిధిలో అభివృద్ధి పనులకు వేర్వేరుగా రూ. 66 కోట్లు, రూ.6.87 కోట్లు మంజూరు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఏర్పాటైన యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కీర్తిపతాకాలను రెపరెపలాడిస్తూ.. అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. కళ్లుండి చూడలేని.. పచ్చపత్రికల అడ్డగోలు రాతలు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులకు మనస్థాపాన్ని కలిగిస్తున్నాయి.. దీంతో విశ్వవిద్యాలయానికి సంబంధించిన ప్రగతి, ప్రభుత్వ సహకారం, నిధులకు సంబంధించిన అంశాలపై కథనం.

ఫ్యాక్ట్ చెక్



2010 నుంచి 2019 వరకు పరిపాలన భవనం పరిస్థితి



2020లో వైవీయూ పరిపాలన భవనం

- ప్రభుత్వ సహకారంతో అభివృద్ధిలో దూసుకుపోతున్న వైవీయూ
- ఇటీవలే న్యాక్ ఏ గ్రేడ్, ఎన్‌ఐఆర్ఎఫ్ ర్యాకింగ్ కైవసం

వైవీయూ : మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక చొరవతో 2006లో గ్రామీణ ప్రాంతమైన పెండ్లిమర్రి మండల పరిధిలో యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్ హయాంలో దాదాపు రూ.100 కోట్లు నిధులు వెచ్చించి విశ్వవిద్యాలయంలోని సర్ సీవీ రామన్ సైన్స్‌బ్లాక్, చెయ్యేరు, పాపాఘ్ని, పెన్నా, చిత్రావతి హాస్టల్స్‌బ్లాక్‌లు నిర్మించారు. ప్రస్తుత పరిపాలన భవనంగా ఉన్న పరీక్షల విభాగం భవనాలను నిర్మించారు. దీంతో పాటు విశ్వవిద్యాలయ ప్రధాన పరిపాలన భవనంకు సంబంధించి రూ. 17 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా, రూ. 9.4కోట్లుతో దాదాపు 60 శాతం మేర పనులు పూర్తయ్యాయి. హ్యూమానిటీస్ భవన నిర్మాణాల కోసం రూ.4.30 కోట్లు, మేనేజ్‌మెంట్ భవన నిర్మాణం కోసం రూ. 2.60 కోట్లు వెచ్చించి ప్లింత్ లెవల్ పూర్తి చేశారు. దీంతో పాటు టీచింగ్ సిబ్బంది క్వార్టర్స్, నాన్‌టీచింగ్ క్వార్టర్స్, క్యాంపస్ స్కూల్, ఎస్సీ, ఎస్టీ హాస్టల్, మహిళా హాస్టల్, రోడ్లు తదితర అవసరాల నిమిత్తం విశ్వవిద్యాలయ అధికారులు రూ.48 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విశ్వవిద్యాలయ ప్రగతి శరవేగంగా సాగుతున్న సమయంలో వైఎస్ఆర్ మరణం విశ్వవిద్యాలయానికి తీరనిలోటుని మిగిల్చింది.

ఒక్క ఇటుక వేయని వైనం..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ఏర్పాటైన భవనాలు మినహా ముఖ్యమంత్రులుగా పనిచేసిన కె. రోశయ్య, ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి, నారా చంద్రబాబునాయుడు హయాంలో ఒక్క ఇటుక కూడా వేయలేదన్నది కఠోర సత్యం. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యోగివేమన విశ్వవిద్యాలయానికి రెండుసార్లు వచ్చి విశ్వవిద్యాలయ ప్రగతికి చేయూతనిస్తామని ఊకదంపుడు ఉపన్యాసమిచ్చి.. ఉత్తుత్తి హామీలతో కాలం గడిపారు. విశ్వవిద్యాలయ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలకు కేవలం కాగితాల్లోనే అంకెల గారడీ చేశారే తప్ప ఒక్క రూపాయి విశ్వవిద్యాలయ ఖాతాకు జమ కాకపోవడం గమనార్హం. ఆ సమయంలో అప్పటి వీసీ ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డి విశ్వవిద్యాలయానికి యూజీసీ వారు అందించిన రూసా నిధులతో అప్పటికే దాదాపు 90 శాతం పూర్తయిన ఆర్ట్స్ అండ్ కామర్స్ భవనాన్ని పూర్తి చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆర్ట్స్‌బ్లాక్‌గా నామకరణం చేశారు.

ఉన్నతవిద్యకు ఊతమిచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్..

ఉన్నతవిద్యలో పలు సంస్కరణలను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వవిద్యాలయాల బలోపేతానికి సంపూర్ణస్వేచ్ఛను, సహకారాన్ని అందించారు. దీంతో యోగివేమన విశ్వవిద్యాలయం న్యాక్ ఏ గ్రేడ్ సాధించడంతో పాటు, ఎన్‌ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్-200 విశ్వవిద్యాలయాల్లో చోటు దక్కించుకుంది. మరో వైపు విశ్వవిద్యాలయంలో ప్రధాన ముఖద్వారం, ప్రధాన పరిపాలన భవనం, రహదారులు అన్నింటి అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందించడంతో విశ్వవిద్యాలయం రూపురేఖలు మారిపోయాయి. ప్రధాన పరిపాలన భవనం సైతం పైలాన్ మినహా పూర్తిస్థాయిలో పూర్తవడంతో విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలు సైతం అక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తుండటం గమనార్హం.

యోగివేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ప్రొద్దుటూరులో ఉన్న వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ. 66 కోట్ల నిధులను మంజూరు చేస్తూ 2021లో ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి రూ. 5 కోట్లు నిధులు మంజూరు కాగా పనులు సైతం ప్రారంభించి ప్లింత్‌లెవల్ పనులు పూర్తికావచ్చాయి. దీంతో పాటు మరో రూ.20 కోట్ల మేర నిధులు సీఎంఎంఎస్ గ్రీన్ చానల్‌లో ఉండగా, మొత్తంగా రూ. 25.24 కోట్లు నిధులను మంజూరు చేసింది. పనులు పూర్తయ్యే కొద్దీ మిగతా మొత్తాన్ని ప్రభుత్వం జమచేస్తుంది.

వైవీయూకు అనుబంధంగా ఉన్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం అభివృద్ధి, విస్తరణ పనులకు రూ.6,87,40,000/- కోట్లు నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీఓనెం. 40 విడుదల చేసింది. స్థల సేకరణ, నూతన భవన నిర్మాణాలకు వినియోగించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంబంధిత రెవిన్యూ అధికారులు ప్రక్రియను వేగవంతం చేస్తే నిధులు ఖాతాల్లో పడతాయి.

హెల్త్‌సెంటర్ అభివృద్ధి కోసం..

విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సౌకర్యార్థం హెల్త్‌సెంటర్‌నుతాత్కాలికంగా వసతిభవనాల సమీపంలో ఏర్పాటు చేశారు. అనంతరం రూ.2 కోట్లతో హెల్త్‌సెంటర్ పనులను ప్రారంభించారు. ప్లింత్ లెవల్‌లో ఆగిపోయిన పనులకు రూ.90 లక్షల మేర నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంతో హెల్త్‌సెంటర్ దాదాపు ఓ రూపుకు వచ్చింది. అయితే కాంట్రాక్టర్ల సమస్యతో కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిచిపోయాయే తప్ప నిధుల కొరతతో కాదన్నది విశ్వవిద్యాలయ అధికారులు సమాధానం.

అభివృద్ధిలో అగ్రస్థానంలో వైవీయూ..

యోగివేమన విశ్వవిద్యాలయం వేగంగా అభివృద్ధి సాధిస్తోంది. న్యాక్ గ్రేడింగ్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో అనుమతులు ఇలా అన్నింటా వైవీయూ అగ్రస్థానంలో నిలుస్తోంది. ప్రభుత్వం సహకారం సంపూర్ణంగా లభించడంతో పాటు విశ్వవిద్యాలయ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, భవన నిర్మాణాలకు రూ. 70 కోట్లకు పైగా నిధులను మంజూరు చేసింది. ఉన్నతవిద్యలో సంస్కరణల్లోనూ వైవీ యూ ముందంజలో ఉంది.

- ఆచార్య చింతా సుధాకర్, వైస్ చాన్సలర్, వైవీయూ

నిధుల కొరత సమస్యే లేదు..

యోగివేమన విశ్వవిద్యాలయం అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తున్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు నిధులను వైవీయూకు మంజూరు చేశారు. విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనులకు నిధుల కొరత అన్న సమస్య లేదు. అభివృద్ధి అన్నది నిరంతర ప్రక్రియ.. ఇందుకోసం ఎప్పటికప్పుడు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తుంటాం.

- ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్, వైవీయూ

ఉత్సాహంగా 'అట్ హోమ్'



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో అట్‌హోమ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ్ రామరాజు మాట్లాడుతూ ప్రాచీన కళలైన తోలుబొమ్మలాట బుర్రకథలతో అట్ హోం కార్యక్రమంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. దేశ స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశ సమైక్యత సమగ్రత కోసం , అన్ని రంగాలలో జిల్లా అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దామన్నారు. విధులు బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిద్దామన్నారు. జిల్లాలో జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు, అన్ని శాఖల జిల్లా అధికారుల కృషి జిల్లా అన్ని విధాల అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. దేశం యావత్తు ఆజాదీకా అమృత్ మహోత్సవాలను అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించుకుంటున్న తరుణంలో ఈ ఏడాది శాఖల వారీగా అభివృద్ధి ఫలాలు సమృద్ధిగా సిద్ధించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధిలో వైఎస్ఆర్ జిల్లాకు ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకురావాలని కలెక్టర్ ధికారులను కోరారు. అనంతరం కలెక్టర్ ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అధికారులను వారి కుటుంబ సభ్యులను పలకరించి పరిచయం చేసుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రొద్దుటూరుకు చెందిన నృత్య తరంగిణి బృందం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, తోలుబొమ్మలాట బుర్రకథ, మ్యాజిక్ షో అందరినీ ఆహ్లాదపరిచి ఆకట్టుకున్నాయి. అందులో భాగంగా పాల్గొన్న కళాకారులకు జిల్లా కలెక్టర్ విజయరామరాజు మెమెంటో లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్,అసిస్టెంట్ కలెక్టర్ భరధ్వాజ్,కడప నగర పాలక కమీషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, డిఎఫ్ఓ రవీంద్ర దామా, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓ లు పి.ధర్మాచంద్రా రెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, పాడ ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి తోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

జగనన్న సుపరిపాలన


దేశానికే ఆదర్శం



జిల్లా పరిషత్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శమని ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జెడ్పీ చైర్మన్‌తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం జవాబుదారితనంతో పనిచేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. సచివాలయ ఏర్పాటు వల్ల ప్రజల ముంగిటకే పరిపాలన వెళ్లిందన్నారు. ప్రజా సేవలో ఉద్యోగులు పునరంకితం కావాలన్నారు. అవినీతి రహితంగాసేవలు అందించాలని కోరారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రహదారులు, భవనాలు, తాగునీరు, ఎస్సీ ఎస్టీ మహిళా శిశు సంక్షేమం కింద మంజూరు చేసిన 110 అభివృద్ధి పనులకు 549 లక్షల రూపాయల జెడ్పీ సాధారణ నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం గ్రాంటు కింద 24 సీపీడబ్ల్యుఎస్ స్కీములకు రూ. 25 కోట్లు మంజూరైందన్నారు. జెడ్పీ ఆదాయాన్ని పెంచేందుకు రూ. 2.40 కోట్ల అంచనాతో 30 షాపింగ్ రూములు జెడ్పీ ఆవరణలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి మంత్రి ఏడుగురికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మాసీమబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐకి పతకం



కడప అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 77వ స్వాతంత్ర్య దినోత్సవల వేడుకల్లో భాగంగా విజయవాడలో కడప టూటౌన్ ఏఎస్ఐ పి. భాస్కర్ (ఏఎస్ఐ 246) ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకున్నారు. పోలీసుశాఖలో దాదాపు 30 ఏళ్ల పాటు ఏఎస్ఐ భాస్కర్ విశిష్ట సేవలను అందించారు. ఈ నేపథ్యంలో టూటౌన్ ఏఎస్ఐ భాస్కర్‌ను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

టీ తాగుతూ.. జనంతో ముచ్చటిస్తూ..



ఎర్రగుంట్ల పట్టణంలో టీ బంకులో టీ తాగుతూ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రతి రోజు ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. మంగళవారం ఎర్రగుంట్ల పట్టణంలో కారులో వెళుతుండగా ప్రజలను చూసి కారులోని నుంచి దిగి ఒక సాధారణ వ్యక్తి లాగా పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఓ టీ బంకులో టీ తాగారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డితో ముచ్చటించారు. వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

బొలెరో దగ్ధం

కొండాపురం : మండల పరిధిలోని తాళ్ల ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వేళ్ల గోవర్ధన్ రెడ్డి బొలెరో వాహనాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ ఘటనపై తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.

బద్వేలుకు చేరిన యువకుడి పాదయాత్ర



పాదయాత్రగా బద్వేలుకు వచ్చిన జిలానీబాషాను సన్మానిస్తున్న బంగారుశీనయ్య

బద్వేలు అర్బన్ : మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన షేక్ జిలానీబాషా చేపట్టిన పాదయాత్ర మంగళవారం నాటికి బద్వేలుకు చేరుకుంది. గత నెల 15న మార్కాపురంలో ప్రారంభించిన పాదయాత్ర 926 కిలోమీటర్లు పూర్తి చేసుకుని బద్వేలుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఎన్‌జీఓ కాలనీలో వైఎస్సార్‌సీపీ గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య జిలానీబాషా పాదయాత్రకు స్వాగతం పలికి సన్మానించారు. జిలానీ బాషా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితే పేద, బడుగు, బలహీన వర్గాలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఈ విషయాలు తెలియజెప్పడమే పాదయాత్ర ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిలానీబాషా, నాయబ్‌గౌస్, హజీజ్, బాలుయాదవ్ పాల్గొన్నారు.

మేరా భారత్ మహాన్.!



కడప చెమ్ముమియాపేట బాలికల పాఠశాల నృత్య ప్రదర్శన

వైఎస్సార్ జిల్లాలో మంగళవారం స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కడప పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా పలువురు అధికారులు, ఉద్యోగులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసుల కవాతు, విన్యాసాలు, శకటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. జై భారత్.. మేరా భారత్ మహాన్ అంటూ మాతృదేశ ఘనతను ప్రతి ఒక్కరూ కీర్తించారు.

– సాక్షినెట్‌వర్క్



పోలీసు మార్చ్‌ఫాస్ట్, గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



జాగిలాల ప్రదర్శన



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి మంత్రి



ఎన్‌సీసీ విద్యార్థులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, అధికారులు



డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చెక్కును అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, అధికారులు



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



దివ్యాంగులకు మోటారు సైకిళ్లను పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



అటవీశాఖ శకటం



ఉద్యానశాఖ శకటం



డ్వామా శకటం



విద్యుత్‌శాఖ శకటం

• ఉత్తమ సేవలకు ప్రశంసలు



వైఎస్సార్ జిల్లా ఇన్‌చార్జి మంతి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ విజయరామరాజుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్



తుషార్ డూడి, ఏఎస్పీ | పవీణ్‌కుమార్, అడిషనల్ ఎస్పీ | కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ | ప్రేరణ కుమార్, ఏఎస్పీ, ప్రొద్దుటూరు | సందీప్‌రెడ్డి, డీఎఫ్ఓ | గంగాధర్‌గౌడ్, డీఆర్వో | ధర్మచందారెడ్డి, ఆర్డీఓ, కడప | నివాసులు, ఆర్డీఓ, జమ్మలమడుగు | వెంకట రమణ, ఆర్డీఓ, బద్వేలు



వెంకటేశులు, ఆర్డీఓ, పులివెందుల | నరసింహులు, ఎస్‌డీసీ, కడప | రవిశంకర్‌రెడ్డి, స్పెషల్ కలెక్టర్, కడప | నాగరాజు, వ్యవసాయశాఖ ఏడీ | శంకర్ బాలాజీ, ఏసీ, దేవాదాయశాఖ | యదుభూషణరెడ్డి, పీడీ, డ్వామా | ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష పీఓ | సరస్వతి, డీడీ, సోషల్ వెల్ఫేర్ | బ్రహ్మయ్య, ఈడీ, బీసీ కార్పొరేషన్



సుధాకర్‌రెడ్డి, సీఈఓ, జెడ్పీ | ఆనందనాయక్, పీడీ, డీఆర్‌డీఏ | రాజు, సీఐ, పులివెందుల | మధుసూదన్‌రావు, సీఐ, కడప | వెంకట కొండారెడ్డి, సీఐ, జమ్మలమడుగు | నాగరాజు, సీఐ, వన్‌టౌన్, కడప | అశోక్‌రెడ్డి, సీఐ, కడప రూరల్ | నరసింహారెడ్డి, సీఐ, చిన్నచౌకుపెం ఎం | ఎండీ షరీఫ్, కడప డీఎస్పీ | వంశీధర్‌గౌడ్, మైదుకూరు డీఎస్పీ | నాగరాజు, జమ్మలమడుగు డీఎస్పీ | రమాకాంత్, దిశ డీఎస్పీ



బాలస్వామిరెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ | రమణయ్య, ఏఆర్ డీఎస్పీ | వేణుగోపాల్‌రెడ్డి, ఏడీ, ఐఅండ్‌పీఆర్ | నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ అధికారి | నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి | విజయ్‌కుమార్, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మాటిక్స్ ఆఫీసర్ | ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ | చెన్నకేశవరెడ్డి, ఈఈ, పబ్లిక్ హెల్త్ | సురేఖ, పిన్సిపాల్, రిమ్స్ వైద్యకళాశాల | లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ | రమాదేవి, రిమ్స్ సూపరింటెండెంట్ | ఎం.మేరి విజయకుమారి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీడీ, కడప

గోవా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సెబ్ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని వెంకటేశ్వరకాలనీలో మద్యం విక్రయిస్తున్న వెంకటగోపాల్‌రెడ్డిని సెబ్ అధికారులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి పెద్ద ఎత్తున గోవా రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన మేరకు.. వెంకటగోపాల్ రెడ్డి, కుమారుడు వంశీకృష్ణారెడ్డి కొన్ని నెలలుగా గోవా రాష్ట్రం నుంచి మద్యం బాటిళ్లను తెప్పించి గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోనే విక్రయించేవారు. తక్కువ ధరకు తెప్పించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో వారి ఇంట్లో పెద్ద ఎత్తున మద్యం సీసాలు ఉన్నాయని సమాచారం రావడంతో మంగళవారం సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో వెంకటగోపాల్‌రెడ్డిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి గోవా రాష్ట్రానికి చెందిన 128 మద్యం ఫుల్‌బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించనున్నట్లు వివరించారు. వంశీకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దాడిలో ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

కారు- ద్విచక్రవాహనం ఢీ



కారు కిందకు దూసుకు పోయిన ద్విచక్రవాహనం

సిద్దవటం : మండలంలోని మిట్టపల్లె గ్రామ సమీపంలోని కడప-చెన్నై ప్రధాన రహదారిలో మంగళవారం సాయంత్రం కారు- ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంటిమిట్ట మండలం చెంచుగారిపల్లె గ్రామానికి చెందిన అరవింద్, వై. శివశంకర్, లోకేశ్వర్లు ముగ్గురు స్వగ్రామం నుంచి కడపకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రం జడ్చర్లకు చెందిన కారు కడప వైపు నుంచి తిరుపతికి వెళుతోంది. ఈ సమయంలో మిట్టపల్లె గ్రామ సమీపంలోని డాబా వద్దకు రాగానే ద్విచక్రవాహనం వేగంగా వచ్చి కారును ఢీకొని కారు కిందకు దూరిపోయింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న అరవింద్, వై.శివశంకర్, లోకేశ్వర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని ఒంటిమిట్ట, సిద్దవటంకు చెందిన 108 వాహన సిబ్బంది రిమ్స్‌కు తరలించారు. కారులో ఉన్న ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు కావడంతో వారిని మాధవరం-1 లోని ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. సిద్దవటం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.





రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివశంకర్, లోకేశ్వర్, అరవింద్

సేవా పతకాలు

ఉత్తమ సేవాపతకం (2023)
ఉగాది సందర్భంగా ప్రకటించినవి)

కడప అర్బన్ : జిల్లాలో పోలీస్‌శాఖలో విశిష్ట సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సేవాపతకాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ అందజేశారు. జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్‌లు పతక గ్రహీతలను అభినందించారు.





ఉత్తమ సేవాపతకం మెడల్‌ను మంత్రి ఆదిమూలపు సురేష్ నుంచి అందుకుంటున్న కడప ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్



సేవాపతకం మెడల్‌ను అందుకుంటున్న ఏఆర్ ఎస్ఐ శేషాద్రి



శీలం మోహన్‌బాబు ఏఎస్ఐ



ఏఆర్ హెచ్‌సి ఆదిమూలం శ్రీనివాసులు



రిమ్స్ పీఎస్ ఏఎస్ఐ రాచరాయుడు



వల్లూరు ఏఎస్ఐ విజయలక్ష్మి



ఏఆర్ హెచ్‌సి రామసుబ్బయ్య

సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు మృతి



బెల్లం కృష్ణారెడ్డి (ఫైల్)

చక్రాయపేట : మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, మండల మాజీ ఉపాధ్యక్షుడు చిలేకాంపల్లె బెల్లం కృష్ణారెడ్డి(87) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబీకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. ఈయన సతీమణి సరోజమ్మ చిలేకాంపల్లె ఎంపీటీసీ సభ్యురాలిగా పని చేశారు. ఈయన ఏపీ టూరిజం రాష్ట్ర డైరెక్టర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి పెద్ద నాన్న. ప్రస్తుత చిలేకాంపల్లె ఎంపీటీసీ సభ్యురాలు వర్ధన కూడా ఈయన కోడలే. ఈయన మరణించిన విషయం తెలియగానే లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, తొండూరు మండల ఇన్‌చార్జి మధురెడ్డి, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్యతోపాటు మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.



కృష్ణారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ మధురెడ్డి